

# పుస్తక పరిచయం




Dr. Geeta Madhavi Kala
17605, Calle Sienna Ct
Morgan Hill, CA-95037, USA
kgeetamadhavi@gmail.com
Phone: 408-483-7700

జీవితంలో అత్యంత ఆసక్తికరమైంది, అత్యంత ఆశ్చర్యకరమైంది, అత్యంత అద్భుతమైంది, అత్యంత అనూహ్యమైంది.. జీవితమే! జీవితానికి నిర్వచనాలు, ఉపమానాలు ఎన్నైనా చెప్పుకోవచ్చు కానీ విభిన్న జీవన విధానాల విషయానికి వస్తే ఒక్కో జీవితం ఒక్కో సవాల్. జీవితం అంటే ఇలా ఉంటుంది, జీవితమంటే ఇలా ఉండాలి, అందమైన జీవితానికి ఆహ్లాదకరమైన సూత్రాలు.. ఇలాంటివి అధ్యయనం కోసం, విశ్లేషణ కోసం ఉపయోగపడతాయేమో కానీ, వాస్తవంలో ఎవరి సమస్యలు వారివే, ఎవరి ప్రశ్నలు వారివే, ఎవరి జవాబులు వారివే. చాలాసార్లు నమ్మకం పునాదుల మీద అనేక జీవితబంధాల నిర్మాణం ప్రారంభమౌతుంది. నమ్మకాలు వమ్మైనపుడు. పునాదులు కదిలినప్పుడు జీవితబంధాలకు అగ్నిపరీక్షలు ఎదురౌతాయి. సరిగ్గా అలాంటి సమయంలోనే మనిషిలోని మనిషి బయటకు వస్తాడు / వస్తుంది. ఆ మనిషిలోని మనిషే జీవితానికి అసలైన నిర్వచనం తెలియచేస్తుంది / చేస్తాడు. ఈ భావాలు స్పష్టంగా ఉన్నాయనిపిస్తే - ఇంక ఈ నవలలోని కథ గురించి వివరంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను.

ఇదొక తన్మయి కథ. భావుకతే జీవితమనుకున్న ఓ యువతి కథ. కానీ అడుగడుగునా అగ్నిగుండాలను ఎదుర్కొన్న అమ్మాయి కథ. ఎక్కడా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ఎదురైన ప్రతి సవాలునీ స్వీకరించి కాలానికి ఎదురీదిన తన్మయి జీవితానుభవాల సంపుటి ఈ నవల. తన్మయి కథ చదువుతుంటే , ఇది కథలా అనిపించదు, ఓ నిజ జీవితాని కళ్ళముందు చూస్తున్నట్లుంటుంది. సిరివెన్నెలగారన్నట్లు ' ఒక్కటంటే ఒక్క లైఫే.. ఏడిపించకుదాన్ని' అనిపిస్తుంది. అలా జీవించగలిగితే బావుండుననిపిస్తుంది. కానీ ఉన్న ఒక్క లైఫే ఇదేనా నరకమంటే అనిపిస్తుంటే, కమ్ముకొచ్చిన కారుమబ్బుల్ని తరిమికొట్టే క్రమంలో తానెన్నో పాఠాలు నేర్చుకుని, మనకెన్నో పాఠాలు చెప్పిన 'వెనుతిరగని వెన్నెల' కథ ఇది.

ఇది ఆహ్లాద నవలకాదు, నిజజీవిత దర్పణం. చాలామంది బయటకు చెప్పుకొని, చెప్పుకోలేని బ్రతుకులోని కోణాలని అత్యంత శక్తివంతంగా అక్షరీకరించిన నవల. ఈ నవల చివరికంటా చదవండి అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు , మొదలు పెడితే ఇందులోని కథే మనల్ని ముందుకు నడిపిస్తుంది.

డా.కె.గీతగారి కలం నుంచి మనసుల్ని కదిలించే నవలలు మరిన్ని రావాలని మనసారా ఆశిద్దాం. ★★★



# పుస్తక పరిచయం




**డా.వైరాగ్యం ప్రభాకర్**
**ఇ.నెం. 2-102, సీతారాంపూర్**
**కరీమ్నగర్ - 505 002**
**ఫోన్: 9014559059**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

ఇది శ్రీశ్రీ స్మృతి కవిత సంకలనం..! ఇందులోని నూటపాతిక కవితల్లో ఒకటే వస్తువు ..అదే 'శ్రీశ్రీ'! వస్తువైవిధ్యం లేకపోయినా ప్రతి కవితా వినూత్నంగా ధ్వనిస్తోందంటే అందుకు కారణం ఇందులోని కవులందర్నీ ఒక సూత్రంలో బంధించిన కవితా వస్తువు 'శ్రీశ్రీ' నే. శ్రీశ్రీ గురించి ఇప్పటిదాకా వేలాది వ్యాసాలు, వేలాది కవితలు వచ్చి ఉంటాయి. ఇంకా వస్తూనే ఉండి ఉంటాయి. అది శ్రీశ్రీ కలిగించిన ప్రభావం, ఆయన కవిత్వం ఇంకా కలిగిస్తున్న ప్రభావం..! సాధారణంగా ఒక కవిగురించో, రచయిత గురించో చాలామంది వ్రాసిన వ్యాసాలో, కవితలో, పద్యాలో ఒకే చోట రావడమనేది ఆయా కవుల/ రచయితల సన్మాన సభ సంచికల్లోనో, షష్టిపూర్తి సంచికల్లోనో జరుగుతుంది. అలా కాకుండా కేవలం శ్రీశ్రీని గుర్తు తెచ్చుకుంటూ శతాధిక ఆధునిక కవులు వ్రాసిన కవితలు ఒక సంకలనంగా రావడమనేది బహుప్రశంసనీయమైన అంశం. ఈ సంకలనానికి ఓ అందమైన రూపమిచ్చిన వారు డా.వైరాగ్యం ప్రభాకర్ గారు. పుస్తకానికిచ్చిన శీర్షిక 'మనలో శ్రీశ్రీ' ఎంతో అర్థవంతంగా ఉండడమే కాక ఆత్మీయంగా కూడా ఉంది. ఈ సంకలనంలోని ప్రతి కవితా శ్రీశ్రీనే పక్కనుండి వ్రాయించినట్లుంటుంది. కొన్ని ఉదాహరణలు: రాజేశ్వరరవు లేదాళ్ళ "శబ్దాలంకారాలతో / కులుకుతూ నడిచే కవిత అతడు/ చమత్కారపు శ్లేషతో / చెణుకులు విసరగల పద్యమతడు.." - ఎస్.ఆర్.భల్లం "విప్లవ కొలనులో వినూత్న స్నానమాడెనో / నిప్పు కణికల దుప్పటి కప్పుకొనెనో / నెత్తుటివాగులో కలం కడుగుకొనెనో.. - డా.వైరాగ్యం ప్రభాకర్ " అసమర్థతను భుజాన వేసుకుని / అసహనమనే అంబరాన్ని శరీరానికి కప్పుకుని / ముక్కుతూ మూలుగుతున్న నేటి యువతకు / శ్రీశ్రీ అక్షరాలే శరాఘాతాలు కావాలి " - డా.పాండాల మహేశ్వర్ "నరులకు కర్తవ్యంబును / వరముగ భావించి ప్రభవ వైఖరులెన్నో!/ నెరిగించిన శ్రీ రంగము / సిరులొల్కెను శ్రీనివాసు సిరిసిరి మువ్వా!".. ఇలా సాగుతాయి ఈ సంకలనంలోని కవితలన్నీ. ఈ సంకలనానికి మామిడి హరికృష్ణగారు, ఎస్.ఆర్.భల్లంగారు వ్రాసిన ముందు మాటలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయి. తెలుగు కవితారంగంలోని ఈ సరికొత్త ప్రయోగం అభినందనీయం.

***